క్లుప్తంగా

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



దాతని సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి మంగళవారం ఎమ్మిగనూరుకి చెందిన ఎం.సి.నాగమ్మ రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు రశీదు, లడ్డూ ప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సత్కరించారు.

కుమారస్వామికి విశేషపూజలు

శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

జ్యోతిబసు సేవలు మరువలేనివి



జ్యోతిబసు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: అట్టడుగువర్గాల ఆశాజ్యోతి, సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు జ్యోతిబసు సేవలు మరువలేనివని ఆ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్, రామ్‌నాయక్ అన్నారు. మంగళవారం ధనుంజయ మీటింగ్‌హాల్‌లో పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జ్యోతిబసు జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు జోసఫ్ చంద్రశేఖర్, రణధీర్, సురేంద్ర, నాగేశ్వరరావు, వీరన్న, గణపతి, పాలశివుడు, శీను, ప్రశాంత్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై రంగారెడ్డి జిల్లాకు చెందిన రామదాసు భజన మండలి వారి భజన కార్యక్రమం అలరించింది. శరణుగణేశ, గణపయ్య నీ రూపం, శ్రీశైలవాస మల్లికార్జున, లింగాష్టకం, శ్రీశైలం శివమయం, శివశివ శంకరా, శంభో హరహర మహదేవ, శ్రీశైలవాస, పార్వతీ నాథుడా, శ్రీగిరిమల్లయ్య పలు భక్తిగీతాలను రవి, అనిల్, మణికుమార్, సునీత, రాణి, అరుణ తదితరులు ఆలపించారు.

ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ డివిజన్ సంచాలకులు గిరీష్

నందికొట్కూరు: ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు గిరీష్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక సహకార సంఘాలకు, ప్రైవేట్ డీలర్ల వద్ద 925.63 టన్నుల యూరియా, 365.8 టన్నుల డీఏపీ, 1547.6 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలోని క్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలువీరభద్ర స్వామివారికి, స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలను నిర్వహించారు.

పాఠశాలల తనిఖీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ కోడూరు, బి కోడూరు గ్రామాల పాఠశాలలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు చేపట్టిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆయన వెంట సమగ్ర శిక్ష జిల్లా కోఆర్డినేటర్ జగన్ మోహన్‌రెడ్డి, ఆల్టర్నేటివ్ స్కూల్స్ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, ఎంఈఓలు యశోద, మోహన్ రెడ్డి ఉన్నారు.



నందికొట్కూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ దార, లబ్బి వెంకటస్వామి



జూపాడుబంగ్లా: వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వెలుగోడు: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పాములపాడు: జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు



పగిడ్యాల: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రైతు బాంధవుడు వైఎస్సార్

- కాటసాని, డాక్టర్ దార
- రైతే దేశానికి వెన్నెముక్క వైఎస్సార్
- పండుగ వాతవరణంలో వైఎస్సార్ జయంతి వేడుకలు

దివంగత నేత వైఎస్సార్ రైతు బాంధవుడని పలువురు కొనియాడారు. వైఎస్ జయంతిని నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వైఎస్ సేవలను గుర్తు చేసుకున్నారు.

నందికొట్కూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల సంక్షేమానికి పెద్ద పీట వేసి ప్రజల గుండెల్లో గుడి కట్టుకున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ అన్నారు. పట్టణంలోని కర్నూలు రహదారిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి కాటసాని, ఎమ్మెల్సీలు కల్పలత, ఇసాక్‌బాషా, డాక్టర్ దార సుధీర్, పాతబస్టాండ్, కోటవీధిలో, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు నివాళ్లర్పించారు. వైఎస్సార్ ఆశయాలు కొనసాగిద్దామని పెద్ద ఎత్తున్న నినాదాలు చేశారు. చాముండి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని కాటసాని ప్రారంభించగా 96 మంది రక్తం దానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, పుల్యాల దివ్య, కౌన్సిలరు మంగళి కృష్ణ, సర్పంచులు జనార్దన్‌గౌడు, ఎంపీటీసీ సురేష్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: బుక్కాపురంలోని రైతు భరోసా కేంద్రం వద్ద వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మహానంది మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని సంతగేటు ఆవరణలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్సీపీ నాయకులు వినయ్, నరసింహయాదవ్, చిన్నమల్లయ్య, రాముడు, లక్ష్మన్నగౌడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహానికి జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాగ ఎల్లయ్య, క్రిస్టియన్ మైనారిటీ విభాగం మండల అధ్యక్షుడు పరశురాముడు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పగిడ్యాల: మండల వ్యాప్తంగా వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, మండల జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి, పార్టీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: మండల కేంద్రంలో వైఎస్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగరాజు, కోఆప్టెడ్ మెంబర్ ముర్తుజావలి, ఎంపీటీసీ సురేష్, మాజీ సర్పంచు బాలునాయక్ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

వెలుగోడు: స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు నివాళులర్పించారు.



నందికొట్కూరు: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాటసాని, డాక్టర్ దార సుధీర్

ఆత్మకూరు: పట్టణంలోని నంద్యాల టర్నింగ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ స్మృతివనానికి అక్కడ ఏర్పాటు చేసిన 21 అడుగుల వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, వెలుగోడు మండల అధ్యక్షులు అంబాల ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం తిరుపంరెడ్డి, ఆత్మకూరు జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కరివేన గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు.

బండి ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బారెడ్డి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శిల్పా భువనేశ్వర్‌రెడ్డి హాజరై వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: వైఎస్సార్ జయంతిని శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ర్యాలీగా బస్టాండ్ ప్రాంగణం వద్దకు చేరుకుని అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షులు వట్టి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైలంప్రాజెక్ట్: వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులు అర్పిస్తున్న అభిమానులు



ఆత్మకూరు: వైఎస్సార్ స్మృతివనం వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు



బండిఆత్మకూరు: కేక్ కట్ చేస్తున్న శిల్పా భువనేశ్వర్ రెడ్డి, నాయకులు



మహానంది: వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు



కొత్తపల్లి: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పంట సాగులో మెలకువలు పాటించాలి

పాములపాడు: నాణ్యమైన దిగుబడులు సాధించాలంటే పంట సాగులో మెలకువలు పాటించాలని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం మిట్టకందాల గ్రామ సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సలహాలు ఇచ్చారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి పంటలు, ఎరువులు, మందులు వేసుకోవాలని సూచించారు. మండలానికి 522 బస్తాల యూరియా వచ్చిందని, మరో 70 టన్నులు రానుందని చెప్పారు. అనంతరం మన గ్రోమోర్ దుకాణాన్ని తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఉన్న ఎరువులను రైతులకు విక్రయించాలని, కొరత రానివ్వొద్దని సూచించారు.

- **పాములపాడు:** రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు స్వామన్న మంగళవారం మండల వ్యవసాయాధికారికి వినతి పత్రం అందజేశారు.

ఆధునిక పద్ధతులు పాటించండి

జూపాడుబంగ్లా: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని ఏఓ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం మండ్లెం, తంగడంచ గ్రామాల్లో మొక్కజొన్న పంటపై పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటేష్, ఎంపీఈఓ మౌనిక పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి

- **బండి ఆత్మకూరు:** మండల పరిధిలోని భోజనం, లింగాపురం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఆర్.పవన్ కుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అలాగే వెటర్నరీ డాక్టర్లు డాక్టర్ అనూష, డాక్టర్ జ్యోత్స్నదేవి ఆధ్వర్యంలో భోజనం, లింగాపురం, సంతజూటూరు, ఎ.కోడూరు గ్రామాల్లో పశుగ్రాస వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

పగిడ్యాల: స్థానిక ఇందిరా క్రాంతి పథం(ఐకేపీ) కార్యాలయంలో బూత్ లెవెల్ ఆఫీసర్లకు శిక్షణ ఉంటుందని తహసీల్దార్ శివరాముడు మంగళవారం తెలిపారు. ఎన్నికల జాబితా, నిర్వహణ తదితర అంశాలపై బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఒక్క రోజు శిక్షణ

పాములపాడు: మండలంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారులకు బుధవారం ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు హాజరుకావాలన్నారు.

- **జూపాడుబంగ్లా:** పంచాయతీల పురోగతిపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఒక్కరోజు శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ గోపికృష్ణ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్నిశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు హాజరుకావాలన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించండి

ఆత్మకూరు: డిగ్రీ అడ్మిషన్‌లను వెంటనే ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్.నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ధనుంజయ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ డ్యూయెల్ డిగ్రీ విధానాన్ని అమలు పరుస్తున్నామని ఉత్తర్వులు ఇచ్చి ఆచరించకపోవడం హాస్యాస్పదమన్నారు. ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడి మూడు నెలలు గడిచినా ఇంతవరకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డిగ్రీ అడ్మిషన్లను ప్రారంభించాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశాంత్, నగేష్, బాలాజీ పాల్గొన్నారు.

పాత రిజర్వేషన్ కొనసాగించాలి

కొత్తపల్లి: అంగన్‌వాడీ ఆయా పోస్టుకు ఉన్న పాత రిజర్వేషన్‌ను కొనసాగించాలని మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ మాల కాలనీ వాసులు ఏసుదాసు, మూల రాజశేఖర్, ఏర్వ నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్-2 ఆయాగా పని చేస్తున్న ఎస్సీ(మాల) మహిళ రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడిందన్నారు. పోస్ట్ భర్తీకి గత నెల 30న విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఎస్సీ గ్రూప్ -3 కేటగిరి వారు అర్హులని ఉండగా రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఈ నెల 4న ఎస్సీ గ్రూప్-2(మాదిగ)కు మార్పు చేయించి తమ వర్గానికి అన్యాయం చేయడం బాధాకరమన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

ఆత్మకూరు: ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆశావర్కర్ల యూనియన్ నాయకురాళ్లు భారతి, ప్రమీల, సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఉపాధ్యక్షులు రణధీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు సమ్మె నోటీసును బైర్లూటీ వైద్యాధికారిణికి అందజేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల యూనియన్ నాయకురాళ్లు వరలక్ష్మి, శాంతి, లింగమ్మ పాల్గొన్నారు.

- **జూపాడుబంగ్లా:** బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ వ్యకాస జిల్లా నాయకుడు కర్ణ కోరారు. మంగళవారం పి.లింగాపురం, తరిగోపుల, 80బన్నూరు, జూపాడుబంగ్లా గ్రామాల్లో సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు.
- **కొత్తపల్లి:** స్కీం వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వి యేసురత్నం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ స్వాములు కార్మికులను కోరారు. మంగళవారం వారు వైద్య ఆరోగ్య అధికారి దీపానాగవేణికి సమ్మె నోటీస్ ఇచ్చారు.
- **బండి ఆత్మకూరు :** లేబర్ కోడ్ ను కు నేడు దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మండల సిఐటియు నాయకులు బండి ఆత్మకూరు పిహెచ్ సి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సరిత కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... లేబర్ కోడ్ రద్దుచేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని , ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని అలాగే అంగన్వాడి, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు , ఫీల్డ్ అసిస్టెంట్ లకు, వెలుగు యానీమాటర్ల కు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ, నేడు నిరసన కార్యక్రమం చేపడుతున్నామని , ఈ కార్యక్రమానికి ప్రజలు శ్రామికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఖర్చులు తగ్గించుకునేందుకు రైతన్న పాట్లు

జూపాడుబంగ్లా: విత్తనాలు, రసాయనిక ఎరువులు, మందులు, సేద్యం ఖర్చులు, కూలీరేట్లు పెరిగిపోవటంతో ఎకరా పొలం సాగుచేసేందుకు రూ.50వేలు ఖర్చు అవుతుంది. పెట్టుబడుల భారం తగ్గించుకునేందుకు రైతులు యంత్రాలపై ఆధారపడుతున్నారు. ఎకరా పొలంలో మొక్కజొన్న విత్తనాలు విత్తుకోవాలంటే నలుగురు కూలీలు అవసరం. ఒక్కొక్కరికి కూలీ రూ.300ల చొప్పున రూ.1,200 ఇవ్వాల్సి వస్తుంది. విత్తనాలు నాటేందుకు సాలు దున్ని పైసాలు కొట్టేందుకు గానూ ఎద్దుల గడేనికి రూ.2వేల చొప్పున విత్తనాలు నాటేందుకు రూ.3,200 ఖర్చు అవుతుంది. ట్రాక్టర్‌తో విత్తనాలు వేసుకుంటే ఎకరాకు కేవలం రూ.వెయ్యితోనూ అయిపోతుంది. ఖర్చు తక్కువ సమయం కూడా ఆదా అవుతుందని రైతులు అధికంగా ట్రాక్టర్లనే ఆశ్రయిస్తున్నారు.

ఒకే రోజులో త్రిలింగ దర్శనం

డోన్ టౌన్: ఆషాఢ మాసం సందర్భంగా భక్తుల సౌకర్యార్థం డోన్ ఆర్టీసీ డిపో నుంచి మహానంది, యాగంటి, అహోబిలం దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ శశిభూషణ్ తెలిపారు. ఈ నెల 12, 13, 20, 27 తేదీల్లో ఈ ప్రత్యేక దర్శన బస్సులు అందుబాటులో ఉండనున్నాయని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డోన్ కొత్త బస్టాండ్ నుంచి ఉదయం 6 గంటలకు బయలుదేరే బస్సు నంద్యాల, మహానంది, ఆళ్లగడ్డ, అహోబిలం, కొయిలకుంట్ల, బనగానపల్లె, యాగంటి మార్గంలో ప్రయాణించి రాత్రి 7 గంటల వరకు తిరిగి డోన్‌కు చేరుకుంటుందన్నారు. ప్రతి ప్రయాణికుడి నుంచి రూ.400 చార్జీ వసూలు చేయనున్నట్లు వెల్లడించారు. టిఫిన్, భోజన ఖర్చులు ప్రయాణికులే భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘ఉపాధి’లో పండ్ల తోటల సాగు

వెలుగోడు: ఉపాధి హామీ పథకం కింద ఉద్యానవనాల పెంపకం చేపట్టేలా ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. మోతుకూరు, వెలుగోడు, అబ్దుల్లాపురం, గుంతకందాల గ్రామాల్లో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా 26 ఎకరాల్లో కొబ్బరి, మామిడి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.

- **పాములపాడు:** మండలంలోని కంబాలపల్లి గ్రామంలోని రైతు సత్యనారాయణ పొలంలో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ అలివేలిమంగమ్మ పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** పారుమంచాల రెవెన్యూపరిధిలోని జూపాడుబంగ్లాకు చెందిన మధుకృష్ణకు చెందిన 3 ఎకరాల పొలంలో జామ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోపికృష్ణ, ఏపీఓ రేష్మ, సర్పంచ్ మొట్టె బాలయ్య పాల్గొన్నారు.
- **మహానంది:** మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతుల పొలాల్లో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఏపీఓ మల్లికార్జున పాల్గొన్నారు.

సొసైటీ తనిఖీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ కోడూరు ప్రాథమిక వ్యవసాయ సొసైటీని మంగళవారం నంద్యాల ఏడీ ఆంజనేయ తనిఖీ చేశారు. గోడౌన్ స్టాకును, రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి పవన్‌కుమార్, సొసైటీ సీఈఓ శ్రీనివాసులు ఉన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

మహానంది: మండల కేంద్రం తిమ్మాపురం ఆరోగ్యం కేంద్రంలో పనిచేస్తూ బదిలీ అయిన ఉద్యోగులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్ దాస్, డాక్టర్ వేణు కార్తికేయ, ఎంపీహెచ్ఈఓ హుసేన్ రెడ్డి ఆధ్వర్యంలో బదిలీ అయిన 13 మంది ఉద్యోగులను సన్మానించారు.

ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక అభివృద్ధి

కొత్తపల్లి: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు ఆర్థిక అభివృద్ధి చెందుతారని ఉద్యాన శాఖ అధికారి చందన, మండల వ్యవసాయ అధికారి అమిరున్నిసా బేగం, పతంజలి కంపెనీ డిప్యూటీ మేనేజర్ రమణారెడ్డి సూచించారు. మంగళవారం దుద్యాల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.

‘ఉపాధి’ని సద్వినియోగం చేసుకోవాలి

వెలుగోడు: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి సూచించారు. మండలంలోని మోతుకూరు గ్రామంలో సామాజిక తనిఖీ బృందం మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నాలుగు నెలల పాటు గ్రామాల్లో ఉపాధి పనులు ఉంటాయని, వలసలు వెళ్లకుండా స్థానికంగానే ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నాగజ్యోతి, ఎస్ఆర్‌పీలు జేఎస్ రాజు, వై.లక్ష్మీనారాయణ, సర్పంచ్ ఎం. చిన్నక్క పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రేపు శాకంబరి ఉత్సవం

మహానంది: ఈనెల 10న మహానందిలో శాకంబరి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు.

ఫెర్టిలైజర్స్ షాపుల తనిఖీ

వెలుగోడు: అబ్దుల్లాపురం గ్రామంలోని శ్రీ సాయి లక్ష్మి ఫెర్టిలైజర్స్, ధనలక్ష్మి ఫెర్టిలైజర్స్ షాపులను మండల వ్యవసాయ అధికారిణి స్వాతి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు లేని రైతులు ఆర్ఎస్‌కేలలో వ్యవసాయ సిబ్బందికి ఆధారాలు ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆలయ నిర్మాణం పూర్తయ్యేనా?

జూపాడుబంగ్లా: రూ.36లక్షల సీజీఎఫ్ నిధులతో మండలంలోని రామసముద్రం గ్రామంలో చేపట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయం ఏడాది గడిచినా పూర్తిచేయకపోవటంతో భక్తులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో 100 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతనమైన వేంకటేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దేవదాయశాఖ అధికారులు ఏడాది క్రితం నూతన ఆలయ నిర్మాణానికి పూనుకుని పనులనను ముక్తా కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించింది. నాలుగు మాసాల్లో పూర్తిచేయాల్సిన ఆలయ నిర్మాణం పనులు ఏడాది గడిచినా పూర్తిచేయకపోవటంతో భక్తులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన దేవదాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతోనే కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా పనులు చేస్తోందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా దేవదాయశాఖ అధికారులు స్పందించి ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని పలువురు కోరుతున్నారు.



ఏడాది గడిచినా నిర్మాణం పూర్తికాని వేంకటేశ్వస్వామి ఆలయం